
మన ప్రజా ప్రతినిధి
ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455
ప్రజా ప్రతినిధి NEWS టీ.వి
తెలుగు దినపత్రిక
ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :259 మంగళవారం జూలై 14 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

# తెలంగాణకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

- పోలవరం పిటిషన్‌లో లోపాలు గుర్తింపు
- ఏపీకి నోటీసులు, స్టే నిరాకరణ
- లోపాలు సరిదిద్దాకే విచారణ



న్యూఢిల్లీ, జూలై 13 (మనప్రజాప్రతినిధి): పోలవరం ప్రాజెక్టు, గోదావరి జలాల వినియోగం, బనకచర్ల అనుసంధానం, కృష్ణా నదీ జలాల అంశాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పిటిషన్‌లో సాంకేతిక లోపాలు ఉన్నాయని పేర్కొన్న సుప్రీంకోర్టు, వాటిని సరిదిద్దిన తర్వాతే తదుపరి విచారణ చేపడతామని స్పష్టం చేసింది. జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పనులపై తక్షణమే నోటీసులు జారీ చేయడంతో పాటు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని

2

# సింగరేణి అధికారులకు భరోసా



- సమస్యల పరిష్కారానికి భట్టి ఆదేశం
- రెండు మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సూచన
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2

# దేవాదుల పనులకు వేగం



- నిధుల కొరతకు తావులేదు
- రైతులకు సాగునీటిపై సర్కారు భరోసా
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2

# రక్తదానంతో బీఆర్ఎస్ నిరసన

- "మా రక్తం తీసుకో... రైతులకు నీళ్లివ్వు" నినాదాలు
- క్యాంపు కార్యాలయానికి వెళ్తుండగా విద్యార్థి నేతల అరెస్టు




2

# పవన్‌ను పరామర్శించిన ఫడ్నవీస్



- భుజం శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్యంపై ఆరా
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

2

# సర్పంచ్ జ్యోతి బలవన్మరణం



- నిర్మల్ జిల్లాలో విషాద ఘటన
- ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్న సర్పంచ్
- కారణాలపై పోలీసుల దర్యాప్తు

నిర్మల్, జూలై 13 (మనప్రజాప్రతినిధి): నిర్మల్ జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. తానూరు మండలం బోరిగావ్ గ్రామ సర్పంచ్ పల్లె జ్యోతి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపడంతో పాటు స్థానికంగా కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.సర్పంచ్ జ్యోతి బలవన్మరణానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు లేదా ఇతర వ్యక్తిగత కారణాలు ఏవైనా ఉన్నాయా అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలిస్తున్నారు. పోస్టుమార్టం నివేదికతో పాటు దర్యాప్తులో లభించే వివరాల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

# అనకాపల్లిలో పర్యటించిన వంగలపూడి అనిత

- ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి
- పార్టీ నేతలతో సమీక్ష సమావేశం
- వినతిపత్రాలు స్వీకరించిన హోంమంత్రి







అనకాపల్లి, జూలై 13 (మనప్రజాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత అనకాపల్లి జిల్లా పర్యటనలో భాగంగా తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులతో సమావేశమైన వంగలపూడి అనిత పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రజా సమస్యలు,

2

# ఆవుల వధపై హైకోర్టు ఆదేశాలకు స్టే

- మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు నిలిపివేత
- తమిళనాడు ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట
- ప్రతివాదులకు నోటీసులు జారీ



న్యూఢిల్లీ, జూలై 13 (మనప్రజాప్రతినిధి): ఆవులు, దూడల వధపై మద్రాస్ హైకోర్టు జారీ చేసిన కీలక ఆదేశాల అమలుపై సుప్రీంకోర్టు తాత్కాలికంగా నిలుపుదల విధించింది. బక్రీద్ సందర్భంగా మాత్రమే కాకుండా ఏ రోజూ రాష్ట్రంలో ఆవులు, దూడలను వధించకుండా చర్యలు తీసుకోవాలని హైకోర్టు తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు హైకోర్టు ఆదేశాల అమలును తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు నిలిపివేసింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ

3

# తెలంగాణకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ


మెదటి పేజీ తరువాయి

కోరారు. అయితే పిటిషన్‌లో ప్రాథమిక లోపాలు ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. ఈ వ్యవహారంలో మొత్తం 15 మంది ప్రతివాదులు ఉన్నారని, వారిలో కేవలం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మాత్రమే మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరడం సమంజసం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రధాన పిటిషన్‌లోని లోపాలను సరిదిద్దకుండా విచారణ కొనసాగించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. పిటిషన్‌లోని సాంకేతిక లోపాలను ముందుగా సవరించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. లోపాలు సరిచేసిన అనంతరం మిగిలిన అంశాలపై విచారణ చేపట్టి, అవసరమైతే తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని తెలిపింది. ఈ దశలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయడం లేదా స్టే ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. దీంతో పోలవరం ప్రాజెక్టు, గోదావరి జలాల వినియోగం, బనకచర్ల అనుసంధానం అంశాలపై తెలంగాణ ప్రభుత్వం కోరిన తక్షణ ఉపశమనం లభించలేదు. పిటిషన్‌లోని లోపాలను సవరించిన తర్వాత కేసు మళ్లీ విచారణకు వచ్చే అవకాశం ఉండగా, తదుపరి విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

# సింగరేణి అధికారులకు భరోసా


మెదటి పేజీ తరువాయి

హైదరాబాద్, జూలై 13 (మనప్రజాప్రతినిధి): సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న సుమారు 2,200 మంది అధికారులకు సంబంధించిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. బొగ్గు గనుల సంస్థల తరహాలో అధికారుల వేతన సవరణ, పనితీరు ఆధారిత ప్రోత్సాహక చెల్లింపుల అమలుపై అధికార సంఘం చేసిన విజ్ఞప్తులను ప్రాధాన్యంగా పరిగణించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఇటీవల తాడిచర్ల2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు మంజూరులో కీలక పాత్ర పోషించినందుకు కృతజ్ఞతలు తెలిపేందుకు సింగరేణి అధికార సంఘం నాయకులు ఉప ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా అధికారులకు సంబంధించిన వివిధ సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి యాజమాన్యానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వారి వినతులపై సానుకూలంగా స్పందించిన భట్టి విక్రమార్క వెంటనే సింగరేణి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సింగరేణి చైర్మన్-కమ్-మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్) గౌతమ్ పోట్రుతో జరిగిన సమావేశంలో అధికారుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి, ఇంధన భద్రతకు సింగరేణి సంస్థ కీలకమని, కార్మికులు, అధికారులు సంస్థ అభివృద్ధిలో విశేష కృషి చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అధికారుల్లో ఎలాంటి అసంతృప్తి నెలకొనకుండా వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. అధికార సంఘం నాయకులతో చర్చించి వారికి భరోసా కల్పించాలని, ఎలాంటి జాప్యం లేకుండా రానున్న రెండు నుంచి మూడు నెలల్లో వారి విజ్ఞప్తులపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉద్యోగుల సంక్షేమమే సంస్థ అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని అన్నారు. ప్రపంచీకరణ, పెరుగుతున్న పోటీ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని బొగ్గు ఉత్పత్తి, విక్రయాల్లో సింగరేణి పోటీతత్వాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సింగరేణిని బహుముఖ రంగాల్లో విస్తరించి అంతర్జాతీయ స్థాయి సంస్థగా తీర్చిదిద్దేందుకు అధికారులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. సంస్థ పురోగతికి అధికారులు సానుకూల దృక్పథంతో పనిచేయాలని అధికార సంఘం నాయకులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సింగరేణి అధికార సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నరసింహులు ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనతో పాటు అధికారుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చూపుతున్న చొరవను అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సింగరేణి అభివృద్ధి కార్యక్రమాలకు అధికారుల తరపున పూర్తి సహకారం అందిస్తూ, సంస్థ సుస్థిరాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# దేవాదుల పనులకు వేగం


మెదటి పేజీ తరువాయి


ములుగు, జూలై 13 (మనప్రజాప్రతినిధి): దేవాదుల ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ఆయకట్టు రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలోని సమ్మక్క సాగర్ ప్రాజెక్టును సందర్శించిన ఆయనతో పాటు నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రాజెక్టు పనులను పరిశీలించారు. హెలికాప్టర్‌లో చేరుకున్న మంత్రులకు జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. ప్రాజెక్టు పనుల్లో నిధుల కొరతకు తావు ఉండదని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. 22 రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపడంతో పాటు దేవాదుల పంపింగ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ప్రాజెక్టు ద్వారా 38.16 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించేలా చర్యలు చేపడుతున్నామని, రైతులకు సాగునీటి కొరత లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పరిధిలోని తుపాకులగూడెం సమ్మక్కసారలమ్మ బ్యారేజీ వద్ద గోదావరి నీటి ప్రవాహం, నీటి నిల్వలను మంత్రులు పరిశీలించారు. అనంతరం గుట్టల గంగారం సమీపంలోని జె. చొక్కారావు దేవాదుల ప్రాజెక్టు వాటర్ పాయింట్‌ను సందర్శించి మోటార్ల పనితీరు, ఎత్తిపోతల సామర్థ్యం, నీటి సరఫరా పరిస్థితులను అధికారులు వివరించారు. ప్రాజెక్టు సామర్థ్యాన్ని మరింత పెంచే అంశాలపై కూడా చర్చించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో దేవాదుల ప్రాజెక్టు పెండింగ్ పనులు, భూసేకరణ, ఎత్తిపోతల వ్యవస్థ, సాగునీరు, తాగునీటి సరఫరా, మోటార్ల పనితీరు తదితర అంశాలపై ఇంజినీరింగ్ అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. పనుల్లో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించి, భూసేకరణ ప్రక్రియను కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పెండింగ్ బిల్లులను ఇప్పటికే విడుదల చేసినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను ముందుగానే అంచనా వేసి కార్యాచరణ అమలు చేస్తున్నామని, గోదావరి జలాలను సమర్థంగా వినియోగించి రైతాంగానికి పూర్తి భరోసా కల్పిస్తామని చెప్పారు. సాగునీరు, తాగునీటి అవసరాలే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని, దేవాదుల ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, అటవీ శాఖ అధికారులు, నీటిపారుదల శాఖ ఇంజినీర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టు పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసి రైతులకు శాశ్వత సాగునీటి భరోసా కల్పించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

# రక్తదానంతో బీఆర్ఎస్ నిరసన


మెదటి పేజీ తరువాయి

హైదరాబాద్, జూలై 13 (మనప్రజా ప్రతినిధి): కాళేశ్వరం ప్రాజెక్టు, రైతులకు సాగునీటి సరఫరాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం, యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ భవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, విద్యార్థి నాయకులు హాజరై రక్తదానం చేశారు. ఈ నిరసనను "రక్తదాహం తీర్చేందుకు రక్తదానం" పేరుతో చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. రైతులకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వెంటనే సాగునీరు అందించాలని, రాజకీయ విమర్శలకు బదులుగా రైతుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల కోసమే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అవసరమైతే తమ రక్తాన్ని కూడా అర్పించడానికి సిద్ధమని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. రక్తదాన శిబిరం అనంతరం సేకరించిన రక్త సంచులతో ముఖ్యమంత్రి శిబిర కార్యాలయానికి వెళ్లేందుకు బీఆర్ఎస్ విద్యార్థి నాయకులు ప్రయత్నించారు. అయితే పోలీసులు వారిని మార్గమధ్యంలో అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసుల చర్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలు ముఖ్యమంత్రి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ శాంతియుత నిరసనను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపించారు. పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండిస్తూ ప్రభుత్వం రైతుల సమస్యలపై స్పందించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు మరింత ముదురుతున్నాయి. ప్రాజెక్టు నిర్వహణ, సాగునీటి సరఫరా, రైతుల ప్రయోజనాల అంశాలపై ఇరు పక్షాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ రాజకీయ వేడిని పెంచుతున్నాయి.

# అనకాపల్లిలో పర్యటించిన వంగలపూడి అనిత


మెదటి పేజీ తరువాయి


స్థానిక అంశాలపై సమీక్ష నిర్వహించారు. పార్టీ శ్రేణులు ప్రజలతో నిరంతరం మమేకమై ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సేవలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు, పార్టీ నాయకులు అందజేసిన వినతిపత్రాలను వంగలపూడి అనిత స్వీకరించారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకోవడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వంగలపూడి అనిత తెలిపారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు

# పవన్‌ను పరామర్శించిన ఫడ్నవీస్


మెదటి పేజీ తరువాయి

ముంబై, జూలై 13 (మనప్రజాప్రతినిధి): భుజానికి విజయవంతంగా శస్త్రచికిత్స చేయించుకున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ముంబైలో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. శస్త్రచికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఫడ్నవీస్, వైద్యుల సూచనలను పాటిస్తూ పూర్తి ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు కొద్దిసేపు పరస్పరం మాట్లాడుకున్నారు. తన ఆరోగ్యం గురించి ప్రత్యేకంగా తెలుసుకోవడానికి వచ్చిన దేవేంద్ర ఫడ్నవీస్‌కు పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తన త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షిస్తూ తెలిపిన శుభాకాంక్షలకు ధన్యవాదాలు తెలియజేశారు. పవన్ కళ్యాణ్ ఇటీవల భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని వైద్యుల పర్యవేక్షణలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆరోగ్య పరిస్థితి సంతృప్తికరంగా ఉందని, వైద్యుల సూచనల మేరకు చికిత్స కొనసాగుతోందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ పరామర్శతో ఇరు రాష్ట్రాల నాయకుల మధ్య ఉన్న సత్సంబంధాలు మరోసారి ప్రతిఫలించాయని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. పలువురు నాయకులు, అభిమానులు కూడా పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షలు వ్యక్తం చేస్తున్నారు. శస్త్రచికిత్స అనంతరం పవన్ కళ్యాణ్ ఆరోగ్యంపై పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పరామర్శిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. పూర్తి ఆరోగ్యం సాధించిన అనంతరం ఆయన తిరిగి తన అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉందని తెలుస్తోంది.

# ప్రేమ వేధింపులు... ప్రాణాలు తీస్తున్న వికృత మనస్తత్వం



**-మంచిర్యాలలో యువతి బలవన్మరణం కలకలం**
**-దేశవ్యాప్తంగా పెరుగుతున్న వేధింపుల ఘటనలు**
**-చట్టాలతో పాటు సామాజిక మార్పు కూడా అత్యవసరం**

జూలై 13 (మనప్రజాప్రతినిధి): ప్రేమ పేరుతో జరుగుతున్న వేధింపులు దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రేమను తిరస్కరించినందుకు యువతులను వెంటాడడం, బెదిరించడం, మానసికంగా హింసించడం, చివరకు ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు సృష్టించడం వంటి ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా తెలంగాణలోని మంచిర్యాల జిల్లాలో చోటుచేసుకున్న విషాద ఘటన మరోసారి ఈ సమస్య తీవ్రతను సమాజం ముందుకు తీసుకొచ్చింది. ప్రేమ పేరుతో వేధింపులు తట్టుకోలేక ఓ యువతి బలవన్మరణానికి పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన మాధవి అనే యువతి, అదే గ్రామానికి చెందిన సింగరేణి ఉద్యోగి వెంకటేష్ ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నాడనే ఆరోపణల మధ్య తన ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. మరోవైపు నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మాధవి కుటుంబ సభ్యులు, బంధువులు ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. ఇది ఒక్కటే ఘటన కాదు. గత కొన్నేళ్లుగా దేశంలోని పలు రాష్ట్రాల్లో ప్రేమ పేరుతో వేధింపులు, వెంటాడటం, యాసిడ్ దాడులు, హత్యలు, బలవన్మరణాలు, సామాజిక మాధ్యమాల ద్వారా బెదిరింపులు వంటి ఘటనలు వరుసగా నమోదవుతున్నాయి. తిరస్కరణను అంగీకరించలేని కొందరు యువకులు మహిళలపై మానసిక, శారీరక వేధింపులకు పాల్పడుతూ చట్టాన్ని కూడా లెక్కచేయడం లేదు. ఈ పరిస్థితి మహిళల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. మానసిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రేమ అనేది పరస్పర అంగీకారంతో కూడిన బంధం. ఒకరు నిరాకరించినప్పుడు ఆ నిర్ణయాన్ని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి వ్యక్తిపైనా ఉంటుంది. అయితే అధిపత్య భావన, కోపం, తిరస్కరణను జీర్ణించుకోలేని మనస్తత్వం కారణంగా కొందరు నేరాలకు పాల్పడుతున్నారు.



కుటుంబాలు, విద్యాసంస్థలు చిన్నప్పటి నుంచే పరస్పర గౌరవం, మహిళల పట్ల గౌరవభావం, భావోద్వేగ నియంత్రణ వంటి విలువలను పిల్లలకు నేర్పించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. చట్టాలు కఠినంగా ఉన్నప్పటికీ బాధితులు తొలి దశలోనే ఫిర్యాదు చేయకపోవడం, వేధింపులను చిన్న విషయంగా భావించడం, కుటుంబాలు కూడా నిర్లక్ష్యం చేయడం వంటి కారణాలతో సమస్య మరింత తీవ్రమవుతోందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. వేధింపులు ప్రారంభమైన వెంటనే పోలీసులను ఆశ్రయిస్తే అనేక విషాదాలను నివారించే అవకాశం ఉంటుందని వారు చెబుతున్నారు. ప్రతి ఫిర్యాదుపై వేగంగా స్పందించి బాధితులకు భరోసా కల్పించడం అత్యంత అవసరమని సూచిస్తున్నారు. ప్రేమ పేరుతో జరిగే నేరాలు కేవలం ఒక కుటుంబానికే కాదు, సమాజానికే పెద్ద హెచ్చరికగా మారుతున్నాయి. యువతలో మానసిక పరిపక్వత పెంపొందించడం, మహిళల నిర్ణయాలను గౌరవించే సంస్కృతిని అలవర్చడం, చట్టాలపై అవగాహన కల్పించడం, వేధింపులపై వెంటనే స్పందించే వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ద్వారానే ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట వేయవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రతి తిరస్కరణను గౌరవించడం కూడా నాగరిక సమాజ లక్షణమేనని వారు స్పష్టం చేస్తున్నారు.

## ఆవుల వధపై హైకోర్టు ఆదేశాలకు స్టే




పిటిషన్‌ను విచారించింది. 1958 తమిళనాడు జంతు సంరక్షణ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా హైకోర్టు సంపూర్ణ నిషేధం విధించిందని రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. చట్టం ప్రకారం పదేళ్లు దాటిన లేదా వ్యవసాయం, సంతానోత్పత్తికి పనికిరాని పశువులను సంబంధిత అధికారుల ధ్రువీకరణతో వధించేందుకు అనుమతి ఉందని ప్రభుత్వం కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. చట్టంలో స్పష్టమైన వెసులుబాట్లు ఉన్నప్పటికీ అన్ని పరిస్థితుల్లోనూ ఆవులు, దూడల వధను పూర్తిగా నిషేధించడం చట్ట పరిధిని మించిన చర్యగా పరిగణించాల్సి ఉంటుందని తమిళనాడు ప్రభుత్వం వాదించింది. ఈ వాదనలను పరిశీలించిన సుప్రీంకోర్టు, హైకోర్టు ఉత్తర్వులకు సవరణ అవసరం ఉందని ప్రాథమికంగా అభిప్రాయపడింది. దీంతో మద్రాస్ హైకోర్టు జారీ చేసిన ఆదేశాల అమలుపై తాత్కాలికంగా స్టే విధించిన సుప్రీంకోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై వారి నుంచి సమాధానం కోరుతూ తదుపరి విచారణను వాయిదా వేసింది. కాగా, బహిరంగ ప్రదేశాల్లో అక్రమంగా ఆవులను వధిస్తున్నారని ఆరోపిస్తూ ఇండు మక్కల్ కట్చి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్య మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు గుర్తింపు పొందిన కబేళాల్లో మాత్రమే జంతువుల వధ జరగాలని, రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల ప్రకారం ఆవులు, దూడల వధను నిరోధించే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఉత్తర్వులపై అభ్యంతరం వ్యక్తం చేసిన తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, అక్కడ తాత్కాలిక ఊరట లభించింది.

## రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో మెదక్ జిల్లాకు కీర్తి తెచ్చిన అమర్నాథ్

**-ఫెన్సింగ్‌లో మెరిసిన మెదక్ పోలీస్ కానిస్టేబుల్ అమర్నాథ్‌కు ఎస్పీ అభినందనలు**
**-రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో కాంస్య పతకం సాధించిన అమర్నాథ్‌కు ఎస్పీ ఘన సన్మానం**



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూలై 13: హైదరాబాద్‌లో 5వ రాష్ట్రస్థాయి తెలంగాణ పోలీస్ క్రీడల్లో మెదక్ జిల్లా పోలీసు శాఖకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ రసాల అమర్నాథ్, ఫెన్సింగ్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మూడో స్థానం సాధించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. రాష్ట్రస్థాయిలో మెదక్ జిల్లా పోలీసు శాఖకు గుర్తింపు తీసుకురావడంతో జిల్లా పోలీసు అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, అమర్నాథ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. క్రీడా రంగంలో క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన విజయానికి మూలమని ఎస్పీ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న ఆల్ ఇండియా పోలీస్ మీట్‌లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మెదక్ జిల్లా, తెలంగాణ రాష్ట్రానికి మరిన్ని పతకాలు సాధించి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. అమర్నాథ్ సాధించిన విజయం జిల్లా పోలీసు సిబ్బందికి స్ఫూర్తిదాయకమని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు రాజశేఖర్ రెడ్డి, జార్జ్, ఆర్ఐ రామకృష్ణతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు


## ఘనంగా ఆర్ద్రా మహోత్సవ కార్యక్రమం





మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్: మర్పడగ గ్రామంలోని శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామిక్షేత్రంలో సోమవారం రోజు ఆర్ద్రామహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం 6-30 గంటలకు గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్వస్తివాచనం అనంతరం నవగ్రహ, దిక్పాలక, రుద్రకలశ స్థాపన స్థాపిత దేవతా పూజ నిర్వహించారు. సంతాన మల్లికార్జున స్వామికి లఘున్యాస పూర్వకంగా సంతాన పాశుపత అభిషేకం, వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్య స్వామికి విశేష పంచామృత ఫల రస అభిషేకం నిర్వహించారు. తర్వాత స్థాపిత దేవతా హవనం, సంతాన పాశుపత హవనం, మహాపూర్ణాహుతి వైభవోపేతంగా జరిగాయి. విజయదుర్గామాతకు విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సిద్ధిపేట శరభేశ్వరాలయ అర్చకులు కొరిడేకృష్ణమూర్తి, హైమవతి దంపతులకు దంపతీపూజ నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణా కమిటీ సభ్యులు అయితా బాలరాజేశం, ఎల్. రామచంద్రం, సురేందర్ రెడ్డి, శ్రీశైలం, గట్టు విఠల్, మర్యాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనకు... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల కఠిన చర్యలు




మనప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక కొత్తగూడెం జిల్లా: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంగంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్న లక్ష్మీదేవిపల్లి పోలీసులు మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడంతో పాటు, గంజాయి వినియోగం, విక్రయం, రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో విశ్వసనీయ సమాచారం మేరకు లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని లోతువాగు ప్రాంతంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించిన పోలీసులు గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించగా గంజాయి సేవించినట్లు నిర్ధారణ కావడంతో వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టి కేసు నమోదు చేశారు. గంజాయి వల్ల కలిగే ఆరోగ్య, మానసిక, కుటుంబ మరియు సామాజిక దుష్పరిణామాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించి, భవిష్యత్తులో మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం న్యాయస్థానం ఆదేశాల మేరకు వారిని డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ, "మాదకద్రవ్యాల నియంత్రణలో పోలీసులు రాజీ పడే ప్రసక్తే లేదని, యువత భవిష్యత్తును కాపాడడం కోసం ఒకవైపు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూనే మరోవైపు చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు నిరంతరం కొనసాగిస్తామని వెల్లడించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి" అని హెచ్చరించారు. ప్రజలు, తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు మాదకద్రవ్యాల నిర్మూలనలో పోలీసులకు సహకరించాలని, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112 కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీల్లో చుంచుపల్లి సీఐ ఆర్ వెంకటేశ్వర్లు, ఎస్సై అఖిల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల విశ్వాసమే నా బలం: సీఎం డీకే శివకుమార్

బెంగళూరు, జూలై 13 (మనప్రజాప్రతినిధి): ప్రజల కళ్లల్లో కనిపించే విశ్వాసమే తనకు అతిపెద్ద బలమని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. ప్రజల కష్టాలు, సమస్యలకు స్పందించడం కంటే గొప్ప సంతృప్తి మరొకటి లేదని ఆయన పేర్కొన్నారు. గృహ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్శన కార్యక్రమంలో ప్రజలను కలిసి వారి వినతులను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి వినతిని శ్రద్ధగా విన్న డీకే శివకుమార్, సంబంధిత అధికారులతో

## దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ఖమ్మం, ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.కూసుమంచి మండలం పాలేరు గ్రామానికి చెందిన ప్రజలు గ్రామ జనాభా అధికంగా ఉన్నందున తమ గ్రామానికి రెండవ రేషన్ దుకాణం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.చింతకాని మండలం వందనం గ్రామానికి చెందిన అమర్లపూడి వసంత రాణి తాను ఇంటర్ చేశానని, ఖాళీగా ఉన్న ప్రీ ప్రైమరీ ఆయా పోస్ట్ కొరకు దరఖాస్తు చేసుకోగా మెరిట్ లిస్ట్ లో పేరు ఉన్నా కూడా పోస్ట్ రాలేదని, ఆయా పోస్ట్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.తల్లాడ మండలం గొల్లగూడెంకు చెందిన జి. సురేష్ తన కుమారుడు గుండ్ల సాత్విక్ కు వైరా బీసీ మహాత్మ జ్యోతి బాపూలే స్కూల్ నందు సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆర్సిఓ బీసీ సంక్షేమ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన డి.ఉపేంద్ర తనకు బ్లాక్ ఫంగస్ వచ్చి కంటిచూపు పోయిందని తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డీపీఎం, సదరంకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా పాఠశాల నిర్మాణం కోసం కలెక్టర్ కు వినతి పత్రం అందజేత



మన ప్రజాప్రతినిధి కొండపాక మండల్ :సోమవారం రోజు కొండపాక మండలంలోని వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద పార్టీలకు అతీతంగా అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కొండపాక మండలానికి మంజూరైన యంగ్ ఇండియా పాఠశాల వేరే మండలానికి తరలిస్తున్నారని సమాచారంతో వేరే ప్రాంతాలకు తరలిపోకుండా మనమంతా ఐక్యమతంగా పోరాటం చేయాలంటూ ఏకగ్రీవం తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 200 కోట్ల వ్యయశీతో యంగ్ ఇండియా స్కూల్ మంజూరు అయిందని, దానికి శంకుస్థాపన కూడా చేయడం జరిగిందని, ఈ పాఠశాలను వేరే మండలానికి తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వార్తల నేపథ్యంలో ఈ అంశాలపై మనమందరం అప్రమత్తంగా ఉండి ఐక్యంగా పోరాడాలని సమావేశంలో మన పిల్లల భవిష్యత్తు మన మండల విద్యాభివృద్ధి సంబంధించిన విషయం విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేద్దామంటూ పార్టీలకు రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి వేరే ప్రాంతాలకు తరలిపోకుండా మనమంతా ఐక్యమంతంగా పోరాటం చేయాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె. హేమావతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అన్ని పార్టీల తాజా మాజీ నాయకులు విద్యావంతులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డు ఎత్తివేతకై రాజీవ్ గాంధీ నగర్ లో పాదయాత్ర




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్:టిఆర్ఎస్(జాగృతి), మాజీ కార్పొరేటర్ మేకలలిత యాదవ్ అధ్యక్షతన జరిగిన మూడవరోజు కార్యక్రమం. పాల్గొన్న చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్.భరించలేని దుర్గంధాన్ని వెదజల్లుతున్న డంపు యార్డుపై 26 జరిగే సదస్సును జయప్రదం చేయాలని పిలుపు.భరించలేని దుర్గంధాన్ని వెదజల్లే రాంకీ డంపింగ్ యార్డును బేషరతుగా తొలగించాలని జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటి డిమాండ్ చేస్తూ 2026, జూలై-13, సోమవారం రోజున కీసర సర్కిల్, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ, రాజీవ్ గాంధీ నగర్, భాగ్యనగర్ కాలనీ, పాత గబ్బిలాలపేటలో టిఆర్ఎస్ (జాగృతి), మాజీ కార్పొరేటర్ మేక లలిత యాదవ్ అధ్యక్షతన పాదయాత్ర కార్యక్రమం జరిగింది. చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ మాజీ ఉపసర్పంచ్, గౌరవ సలహాదారుడు ఆర్. నర్సింహ్మా గౌడ్, సిపిఐ(ఎం.ఎల్) గద్దం సదానందం, సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ ఆనురాధ, వై.మల్లేష్, ఇఫ్టూ అరుణ, శివబాబు, టియుసిఐ వి.ప్రవీణ్, దమ్మాయిగూడ ఎత్తరి గణేష్, పిఓడబ్ల్యూ డి.స్వరూప, లక్ష్మీ బాయ్, సిఎంఎస్ జయ, అల్లూరి సావిత్రి, పిఓడబ్ల్యూ (విముక్తి) పెర్క సునీత, పిఓడబ్ల్యూ ఫాతిమా, బి.ఎన్.ఆర్.కె.ఎస్. సూర వెంకటేష్, పిడిఎం చంద్రమౌళి, విజయ్, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ టి.కాలేషా, టివిఐవి మబ్బుబాలు, ఎస్.బి.ఎన్.కె.ఎస్. కుమార్, జర్నలిస్ట్ కొన్నెవేణు తదితరులు హాజరై, రాంకీచెత్త డంపింగ్ చెరువులను, కుంటలను, గాలి, నేలను కలుషితం చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని, వారి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నదని ఎత్తిచూపారు. దీనిపై ప్రజలలో అవగాహన కల్పించెందుకు జూలై-1 నుండి 20 వరకు డంపింగ్ యార్డు ప్రభావిత కీసర, శామీర్ పేట, కాప్రా, యాప్రాల్ మండలాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు, జవహర్ నగర్ పలు బస్తీలలో పాదయాత్రలు చేపట్టామని వివరించారు. జూలై-26 న పర్యావరణం, ఆరోగ్య, భద్రత జీవించే హక్కుకై జరిగే సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దుర్గంధం వెదజల్లే రాంకీ చెత్త డంపింగ్ యార్డు తొలగించే వరకు ఉద్యమిద్దామని కొనసాగించాల్సిన అవసరాన్ని వివరించారు.

## ఆమె భద్రతకు పోలీస్ అక్క కార్యక్రమం



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా:సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంసూర్యాపేట జిల్లాల్లో పోలీస్ అక్కలి కార్యక్రమం ప్రారంభించిన సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్మహిళలకు, బాలికలకు భద్రత కల్పించడమే లక్ష్యం.సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్.తెలంగాణ పోలీసు వినూత్నంగా చేపట్టిన పోలీసు అక్కబి అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజు జిల్లా పోలీసు కార్యాలయం నందు ఎస్పి నరసింహ ఐపిఎస్ అధ్వర్యంలో మహిళా పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించి పోలీసు అక్క కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమం నందు అన్ని పోలీసు స్టేషన్ ల నుండి పోలీస్ అక్కలు హాజరైనారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పోలీస్ అధ్వర్యంలో డిజిపి మహిళల, బాలికల, విద్యార్థినుల రక్షణ కోసం పోలీస్ అక్క అనే విశిష్ట మైన, వినూత్నమైన కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగినది. సమాజంలో మహిళలకు, పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు ధైర్యం కల్పించడం, పోలీసు స్టేషన్ కు వచ్చే మహిళా పిర్యాదుదారులకు, బాధితులకు భరోసా కల్పించడం, స్నేహపూర్వక వాతావరణంలో వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం చేయడం ఈ పోలీస్ అక్క కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. మహిళలు, విద్యార్థినులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా లేదా భయపడకుండా తమ సమస్యలను ఒక సొంత అక్కతో పంచుకున్నట్లు పోలీసులతో పంచుకునేలా చేయడం అన్నారు. మన సమాజంలో మహిళల, విద్యార్థినుల రక్షణలో, భద్రతలో ఎన్నో మార్పులు, ఎన్నో చట్టాలు ఆదునికరించబడ్డాయి, కొత్త చట్టాలు వచ్చాయి, షీ టీం, బరోసా సెంటర్, సఖీ సెంటర్, ఇలా అనేక రక్షణ విభాగాలు వచ్చాయి, సతీసహగమనం లాంటి పరిస్థితుల నుండి శాస్త్ర సాంకేతిక అవిష్కరణలు చేయడం, చట్టాలను, ప్రభుత్వ పాలనను నడిపించే స్థాయికి మహిళలు ఎదిగారు అన్నారు. మహిళలకు హక్కులను సాధించడంలో ఎందరో మహానుభావులు కృషి చేసినారు. ఇలాంటి సమాజంలో ఇప్పుడు మహిళల, విద్యార్థినుల రక్షణ పోలీసు అక్క బాధ్యత అన్నారు. మహిళల, విద్యార్థినుల రక్షణలో పోలీసు అక్క పటిష్టంగా పని చేయాలని అన్నారు. పోలీసు స్టేషన్ కు వచ్చే బాధితులకు భద్రత, భరోసా కల్పించడం తో పాటుగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న బాలికల విద్యాలయాలను, కాలనీలోని మహిళా సంఘాలను సందర్శించి మహిళల రక్షణ చట్టాల గురించి, షీ టీం, బరోసా పోలీస్, పోక్సో చట్టాల గురించి అవగాహన కల్పించాలి అన్నారు. నెలలో ఒక రోజు బాలికల హాస్టల్స్ నందు నిద్రించి స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించాలి అన్నారు. పోలీస్ యూనిఫాం ధరించి పోలీస్ అక్క ఆదర్శంగా ఉండాలని కోరారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళా కానిస్టేబుల్‌ను “పోలీస్ అక్కగా నియమించాం అన్నారు. దీని ద్వారా ఆకతాయిల వేధింపులు, ర్యాగింగ్ మరియు బాల్య వివాహాల వంటి సామాజిక అరిష్టాల నివారణకు ఇది ఎంతో తోడ్పడుతుంది. బాధితుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతూ చట్టపరమైన చర్యలు మరియు కౌన్సెలింగ్ అందిస్తారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినులలో ఆత్మస్థైర్యం పెరిగి, తమకు ఏ సమస్య ఎదురైనా తక్షణమే స్పందించే ధైర్యం కల్గుతుంది అన్నారు. సమస్యలు, వేదింపులు ఉంటే డయల్.100, 112 లను సంప్రదించి పోలీసు సేవలు పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజు భార్గవి, మహిళా ఎస్సై లు మౌనిక, నీలిమ, జాన్సీ రాణి, ఎఎస్సై లు సైదాని, అరుణా దేవి, కవిత, మహిళా సూపరింటెండెంట్ సబితా రాణీ, శ్రీదేవి, అన్ని పోలీస్ స్టేషన్ ల పోలీసు అక్కలు పాల్గొన్నారు.



## కలెక్టర్ కార్యాలయం వద్ద ఇందిరమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేయాలి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ :సాధ్యమైనంత త్వరలో కలెక్టర్ కార్యాలయం వద్ద ఇందిరమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు పరిరక్షణ సమితి అధ్యక్షురాలు ఇంద్రపాల భవాని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఆ సంస్థ తరపున 21వ విడత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ 21వ విడత అన్నదాన కార్యక్రమానికి మేడ్చల్ నియోజకవర్గం తెలుగు యువత నాయకులు రెపన్ లక్ష్మణ్ సహకరించారని వారికి సంస్థ తరపున ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి అనేక మంది వివిధ పనుల నిమిత్తం కలెక్టర్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో వస్తుంటారని అటువంటివారు పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు చేసి భోజనం చేయలేక ఇబ్బందులు పడుతున్నారని ఆమె అన్నారు. అటువంటివారిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఇందిరమ్మ కాంటీన్ ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ జనరల్ సెక్రటరీ ఇంద్రపాల సత్యనారాయణ, దావత్ అరుణ్ కుమార్, అంబాల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డు చైర్మన్‌కు సలీం జన్మదిన శుభాకాంక్షలు



మనప్రజాప్రతినిధి/రాజన్నసిరిసిల్ల జూలై, 13:తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ మహమ్మద్ అజ్మతుల్లా హుస్సేన్ జన్మదినాన్ని పురస్కరించుకొని రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రముఖ మైనార్టీ నాయకుడు మహమ్మద్ సలీం ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని చైర్మన్ నివాసానికి వెళ్లిన సలీం, ఆయనకు పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మహమ్మద్ సలీం మాట్లాడుతూ... రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి, అమూల్యమైన వక్ఫ్ భూముల పరిరక్షణకు అజ్మతుల్లా హుస్సేన్ నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల జిల్లాకు చెందిన పలువురు మైనార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలను అరికట్టడానికి, డిజిటల్ భద్రతను పటిష్టం చేయాలి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మంటెక్నాలజీ అత్యంత అవసరమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు.సైబర్ నేరాల నియంత్రణ, దర్యాప్తులో అత్యాధునిక సాంకేతికత, డిజిటల్ ఫోరెన్సిక్స్, జాతీయ సైబర్ నేరాల నివేదన పోర్టల్,“మనీ రిస్టోరేషన్ పోర్టల్“ “గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మెకానిజం పోర్టల్“ సమన్వయ పోర్టల్, చట్టపరమైన అంశాలపై పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం పోలీస్ శిక్షణ కేంద్రంలో నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... సైబర్ ప్రమాదాలను ఎదుర్కోవడానికి బలమైన విధానపరమైన సమన్వయం అవసరమని అన్నారు. సైబర్ నేరగాళ్లు సాంకేతికతను వాడుకుని నేరాలకుపాల్పడుతున్నారని, అదే సాంకేతికతతో వారి ఆట కట్టించాల్సిన అవసరం ఉందని తెలిపారు.సైబర్ భద్రతను ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. జిల్లావ్యాప్తంగా సైబర్ క్రైం కేసుల దర్యాప్తు, స్పందన, ఎన్‌ఫోర్స్‌మెంట్ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి అధునాతన సాంకేతికతలు అవసరమని అన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్న వారిలో ఎక్కువ మంది విద్యాధికులే ఉంటున్నారన్నారు.కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, సైబర్ క్రైమ్ ఏసీపీ ఫణిందర్ పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియను మూడు నెలలు పొడిగించాలి

## –సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు అందె అశోక్ –సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్ ఎదుట ధర్నా



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియను మూడు నెలలు పొడిగించాలని డిమాండ్ చేస్తూ చేర్యాల మండల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం చేర్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.అనంతరం తహసీల్దార్ శ్రీవాస్య సందీప్ కు మెమోరాండం సమర్పించారు.ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం తీసుకొచ్చిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో అనేక లోపాలు ఉన్నాయని ఆరోపించారు.2002 సంవత్సరంలో ఓటర్ లిస్టులో ఉన్న ఓటరే ప్రమాణికం చేసి అంతకంటే ముందు తర్వాత ఉన్న వారిని పరిగణలోకి తీసుకోకుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. గ్రామస్థాయిలో ఓటర్లకు బీఎల్ఏ,బీఎల్ ఓ లు ఇప్పటివరకు ఫారాలు పూర్తిస్థాయిలో అందజేయలేదని అన్నారు. గ్రామాల్లో కేవలం ముప్పై శాతం వరకే జరిగిందన్నారు. సంబంధిత బూత్ లెవల్ అధికారులు వెంటనే వృద్ధులు,వికలాంగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఇంటింటికి తిరిగి ఫారాలు పూర్తి స్థాయిలో నింపి త్వరితగతిన అందజేసి పూరించాలని అన్నారు. సామాన్య ప్రజలకు దరఖాస్తు ఫారాలు ఎలా పూరించాలో తెలియక అయోమయానికి గురవుతున్నారని,గ్రామ స్థాయిలో బీఎల్ఓ ల సంఖ్యను పెంచాలన్నారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి లోపాలను సరిచేసి సర్ ప్రక్రియ గడువును మూడు నెలలకు పెంచాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారుఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య,మండల కోశాధికారి నంగి కనకయ్య,మండల కార్యవర్గ సభ్యులు గూడెపు సుదర్శన్, పాల సాయిలు,రిక్కల మహిపాల్ రెడ్డి,సిద్దిరాం భద్రయ్య,మనెపల్లి కిష్టయ్య,గూడెపు సంతోష,శ్రీనివాస్ రెడ్డి,మల్లేశం, బాలరాజు,జనార్దన్ ,తదితరులు పాల్గొన్నారు.

# మంత్రిని కలిసిన చైర్మన్ శంకర్



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్:కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ గా నియమితులైన తప్పెట శంకర్ సోమవారం రోజు సచివాలయం లో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ స్టేట్ చైర్మన్,మానకొండూరు శాసనసభ్యులు కవంపల్లి సత్యనారాయణ ,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గాడిపల్లి రఘువర్ధన్ రెడ్డి ( ఎన్ఆర్ఐ ) తో కలిసి రాష్ట్ర ఆరోగ్య శాఖ మాత్యులు దామోదర రాజానర్సింహ గారిని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు..జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలనీ,ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రిగారు సూచించినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ స్టేట్ వైస్ చైర్మన్ కొమ్ము విజయ్ కుమార్ మరియు జిల్లా వైస్ చైర్మన్ లు కోత్తూరి నరహరి, బండమీది తిరుపతి (ఐఎన్ టియుసి) జిల్లా అధ్యక్షులు వడ్లకొండ రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.




# అమలుకు నోచుకోని జర్నలిస్టుల సంక్షేమ హామీలు

## నిరసనగా టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ ముందు ధర్నా



మన ప్రజా ప్రతినిధి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నిర్దిష్టంగా అమలుచేయాలని మీడియా స్వేచ్ఛ కాపాడాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ( టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర వ్యాపిత పిలుపులో బాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని భారీగా నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ఎస్ కె సలీమా, గుమ్మడి ప్రసాద్,జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, కార్యదర్శి బనావత్ రవి నాయక్,మేడ్చల్ నియోజకవర్గం కన్వీనర్ అంబాల విష్ణు,జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అర్హులైన వారందరికీ వెంటనే అక్రిడేషన్ ఇవ్వాలని, హెల్త్ కార్డులు, పిల్లలకు స్కూల్ ఫీజుల్లో రాయతీలు ఇండ్ల స్థలాల హామీలు అమలు విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవరిస్తుందని అన్నారు. ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని లేందంటే ఆందోళ తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని ఈ సందర్బంగా హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా, నియోజక వర్గం ఇంచార్జ్ లు నాయకులు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఆదర్శ విద్యావేత్త ప్రొఫెసర్ పప్పుల లక్ష్మీనారాయణకు అశ్రుపూర్వక వీడ్కోలు





మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం. ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్,మెకానికల్ ఇంజినీ రింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ పప్పుల లక్ష్మీనారాయణ,అంతి మయాత్రలో జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి,పాల్గొని ఘనంగా నివాళు లర్పించారు.సోమవారం హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో జరిగిన ఆయన అంత్యక్రి యల్లో ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి,స్వయంగా పాడె మోసి, ప్రొఫెసర్ పప్పుల లక్ష్మీనారాయణ,పట్ల తనకున్న ఆప్యాయత, గౌరవాన్ని చాటుకున్నారు. అనంతరం ప్రొఫెసర్ కుటుంబ సభ్యు లను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి మీడియా తో మాట్లాడుతూ జనగామ జిల్లా లింగాలఘనపూర్ మండలం సిరిపురం గ్రామంలో జన్మించిన ప్రొఫెసర్ పప్పుల లక్ష్మీనారాయణ విద్యారంగంలో తనదైన ముద్ర వేశారు.1991లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా సేవలు ప్రారంభించి,తన ప్రతిభతో ప్రొఫెసర్‌గా ఎదిగి,2021 నుంచి 2024 వరకు రిజిస్ట్రార్‌గా విశిష్ట సేవలు అందించారు.విద్య,పరిశోధన,పరిపాలన రంగాల్లో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం..వేలాది మంది విద్యార్థుల అభివృద్ధి, అధ్యాపకుల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి చిరస్థాయిగా గుర్తుండిపోతుంది.ప్రొఫెసర్ పప్పుల లక్ష్మీనారాయణ మరణం ఉన్నత విద్యారంగానికి,ముఖ్యంగా ఉస్మానియా విశ్వవిద్యాలయానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం ప్రొఫెసర్ పప్పుల లక్ష్మీనారాయణతో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు. ఆయనతో గడిపిన అనేక జ్ఞాపకాలను స్మరించుకుంటూ,వారి ఆశయాలు, సేవలు భావిత రాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.వారి ఆత్మకు శాంతి చేకూ రాలని ప్రార్థిస్తూ..కుటుంబ సభ్యులకు మరోసారి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కాపాడుకోవాలి

## పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు



రాజన్నసిరిసిల్ల, జూలై ,13: తెలంగాణలో ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించేందుకు, కొత్త పేర్ల నమోదు మరియు తప్పుల సవరణ కోసం బూత్ లెవెల్ అధికారులు (బి ఎల్ ఓ) నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు పిలుపునిచ్చారు.సోమవారం సిరిసిల్లలో నిర్వహించిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రతి మనిషికి ఓటు హక్కు అనేది ఎంతో కీలకమైందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బూత్ లెవెల్ అధికారులకు ప్రజలు సరైన సమాచారం అందించి, ఓటర్ జాబితాలో తమ వివరాలు తప్పులు లేకుండా సరిగ్గా ఉన్నాయో లేదో స్వయంగా సరిచూసుకోవాలని సూచించారు.ప్రతి బూత్‌లో కాంగ్రెస్ హెల్ప్ డెస్క్‌ఓటర్లకు అవగాహన కల్పించేందుకు మరియు నమోదు ప్రక్రియలో సహాయం చేయడానికి సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి పోలింగ్ బూత్ వద్ద 'హెల్ప్ డెస్క్' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు దేవరాజు ఈ సందర్భంగా ప్రకటించారు.ఈ కార్యక్రమంలో బూత్ సూపర్‌వైజర్ బొప్ప దేవయ్య, కౌన్సిలర్ లింగంపల్లి రాజు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు రమేష్, శ్రావణ్, సబ్బని వేణు, ఇప్పపుల లక్ష్మణ్, బాలరాజు, నాగభూషణం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల విశ్వాసమే నా బలం: సీఎం డీకే శివకుమార్

బెంగళూరు, జూలై 13 (మనప్రజాప్రతినిధి): ప్రజల కళ్లల్లో కనిపించే విశ్వాసమే తనకు అతిపెద్ద బలమని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. ప్రజల కష్టాలు, సమస్యలకు స్పందించడం కంటే గొప్ప సంతృప్తి మరొకటి లేదని ఆయన పేర్కొన్నారు. గృహ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్శన కార్యక్రమంలో ప్రజలను కలిసి వారి వినతులను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి వినతిని శ్రద్ధగా విన్న డీకే శివకుమార్, సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.ప్రజల సమస్యలను చట్టబద్ధమైన పరిధిలో పరిష్కరించడం తన ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదును నిష్పాక్షికంగా పరిశీలించి, అర్హులకు న్యాయం అందేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే ఉద్దేశంతో ప్రజా దర్శన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని డీకే శివకుమార్ పేర్కొన్నారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవడం ద్వారా పాలన మరింత పారదర్శకంగా, ప్రజలకు చేరువగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా సామాజిక మాధ్యమంలో కూడా ఆయన స్పందించారు. "ప్రజల కళ్లలో కనిపించే విశ్వాసమే నా బలం. ప్రజల కష్టాలకు స్పందించడం కంటే గొప్ప సంతృప్తి మరొకటి లేదు. గృహ కార్యాలయంలో నన్ను కలిసేందుకు వచ్చిన ప్రజల వినతులను స్వీకరించాను. వారి సమస్యలకు